
సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



అక్రమ ఆస్తుల కేసులో శైలేంద్ర అరెస్టు

అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై పరిశ్రమలశాఖ డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ చల్లరపు శైలేంద్రకుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. -8లో▸



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: ఎగువ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 3,82,100 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 3,81,655 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం నీటి మట్టం 33.1400 టీఎంసీలు.

డీఎస్సీ ఎస్జీటీలో జిల్లా ఫస్ట్



తిరువూరు: మెగా డీఎస్సీలో ఎ.కొండూరు మండలం రేపూడి తండాకు చెందిన భూక్యా జాన్సన్ 100కు 95 మార్కులు సాధించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎస్జీటీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. జాన్సన్‌ను గ్రామస్తులు అభినందించారు.

న్యూస్‌రీల్

మహనీయుల ఆలోచనలు స్ఫూర్తిదాయకం

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



కోనేరుసెంటర్: మహనీయుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాశంపంతులు చిత్రపటానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి ఆంధ్రరాష్ట్ర అవతరణ తరువాత తొలి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన గొప్పవ్యక్తి ప్రకాశంపంతులు అని కొనియాడారు. విద్య, స్వాతంత్ర్య పోరాటం, రాజకీయాల్లో ప్రకాశంపంతులు తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఎస్బీ సీఐ వాకా వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్సులో ఘర్షణకు దిగిన మహిళలపై కేసు

జగ్గయ్యపేటఅర్బన్: ఉచిత బస్సులో సీటు కోసం సిగపట్లు పట్టుకున్న మహిళలపై జగ్గయ్యపేట పోలీసులు కేసు నమోదు చేశారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకంలో భాగంగా ఇటీవల ఎన్టీఆర్ జిల్లా విజయవాడ-జగ్గయ్యపేట రూటు బస్సులో సీటు విషయమై మహిళల మధ్య చెలరేగిన గొడవలో ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఎంత చెప్పినా వారు వినకపోవడంతో డ్రైవర్ నేరుగా బస్సును జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. జగ్గయ్యపేట పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మేఘావత్ ఉషారాణి బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనుగంచిప్రోలుకు చెందిన బండారు ఆదిలక్ష్మి, తురకా లావణ్య అనే తల్లీకూతుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.రాజు శనివారం తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో అనుచితంగా ప్రవర్తించడంపై బీఎన్ఎస్ సెక్షన్ 3,126(2), ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడంపై 115(2), పబ్లిక్ న్యూసెన్స్ కింద 351(2) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్లు తెలిపారు.

సింహశయన బుద్ధ ప్రాజెక్టు పూర్తికి సహకరించండి

మంత్రి దుర్గేష్‌ను కోరిన ఘంటసాల బౌద్ధ గురువు భంతే ధమ్మ ధజ థెరో



ఘంటసాల: ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఘంటసాల అభివృద్ధి చెందేందుకు చేపట్టిన సింహశయన బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం సహకరించాలని ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను ఘంటసాలకు చెందిన బౌద్ధ గురువు భంతే ధమ్మ ధజ థెరో కోరారు. రాజమండ్రిలోని పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్‌ను కార్యాలయంలో భంతే ధమ్మ ధజ థెరో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భంతే ధమ్మ ధజ థెరో మాట్లాడుతూ విద్యార్థులకు మానవ విలువలు, ఒత్తిడి లేని ధ్యానం, గొప్ప వ్యక్తిత్వ వికాసం, విద్య గురించి మంత్రితో చర్చించి పాఠశాలల్లో అమలు చేసేలా చూడాలని కోరినట్లు చెప్పారు. ఈ అంశం పై విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడిస్తానని చెప్పారన్నారు. బుద్ధ సర్క్యూట్‌లో భాగంగా ఘంటసాల ప్రాజెక్టును గోదావరి పుష్కరాల్లోపు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం మానవతా విలువలు, మానసిక ఒత్తిడిని నియంత్రించే ధ్యానం - మహోన్నత వ్యక్తిత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కరపత్రాలను మంత్రితో అనుచరులకు భంతే ధమ్మ ధజ థెరో అందించారు.

సముద్రంలోకి 3,75,125 క్యూసెక్కులు వరద

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 3,75,125 క్యూసెక్కుల వరద సముద్రంలోకి వదిలివేస్తున్నారు. ఎగువ నుంచి బ్యారేజ్‌కు 3,92,920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దీనిలో 3,75,125 క్యూసెక్కులు సముద్రంలోకి, మిగిలిన 17,795 క్యూసెక్కుల వరద డెల్టాలోని కాల్వలకు విడుదల చేశారు. శుక్రవారం రాత్రి నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వరద తగ్గుముఖం పట్టింది.

యాప్‌లతో యాతన


- లోకోస్ యాప్‌పై భిన్నాభిప్రాయాలు
- ఐకేపీ సిబ్బంది స్మార్ట్‌ఫోన్లలో సాంకేతిక సమస్యలు
- గోప్యత లోపిస్తుందంటూ డ్వాక్రా మహిళల ఆందోళన
- డేటా నమోదుకూ తంటాలు

పెడన: మొబైల్ బుక్‌కీపింగ్, ఎస్‌హెచ్‌జీ యాప్, మెయిన్ యాప్, సబ్‌యాప్ అంటూ డ్వాక్రా గ్రూపులు, అందులోని సభ్యుల వివరాలు, లావాదేవీలు తదితర అంశాల నమోదు కోసం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌ల నిర్వహణ ఐకేపీ సిబ్బంది, డ్వాక్రా సభ్యులకు తలనొప్పిగా మారింది.

మహిళా సంఘాల పనితీరు, నెలవారీ సమావేశాలు, రుణాల మంజూరు, చెల్లింపులు, లావాదేవీలన్నింటినీ ఇప్పటివరకు ఐకేపీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో చేస్తూ వచ్చారు. ఇకనుంచి పొదుపు సంఘాల లెక్కలన్నీ పక్కాగా ఉండేలా డ్వాక్రా గ్రూపులు, ఆయా గ్రూపుల్లోని సభ్యుల వివరాలు, వీరి లావాదేవీలు అన్నింటి కోసం రూపొందించిన యాప్‌లో నమోదు చేసేలా చర్యలు చేపట్టడం తలకు మించిన భారంగా మారడంతో డ్వాక్రా గ్రూపుల నిర్వాహకులు, ఐకేపీ సిబ్బంది అవస్థలుపడుతున్నారు.

ఆర్థిక విషయాలు బహిర్గతం!..

రాష్ట్రప్రభుత్వానికి సంబంధించిన ఉమెన్ పవర్ యాప్‌లో మన డబ్బులు..మన లెక్కలు అంటూ ఒక యాప్ ఏర్పాటు చేశారు. లోకోస్ యాప్ (కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి)లో డ్వాక్రా గ్రూపులు, వారి పూర్తి వివరాలు, మొబైల్‌బుక్ కీపింగ్, ఎస్‌హెచ్‌జీ యాప్ అంటూ సుమారు 15 నుంచి 20రకాల యాప్‌ల్లో ఐకేపీ సిబ్బందితో పాటు డ్వాక్రా గ్రూపు నిర్వాహకులు కూడా ఆయా వివరాలు నమోదు చేయాల్సివస్తోంది. వీటన్నిటిలో కూడా ఆయా మండలాల్లో గ్రూపుల వివరాలన్ని కూడా నమోదు చేసి ఆన్‌లైన్ చేసే పని ఇప్పటికే పూర్తికావచ్చింది. అయితే ఈ యాప్‌లపై డ్వాక్రా మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థికపరమైన విషయాలు బహిర్గతమవుతాయనే అనుమానాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వీవోఏలు డ్వాక్రా గ్రూపులపై పర్యవేక్షించే వీలేజ్ ఆర్గనైజేష్ అసిస్టెంట్లు ఈ యాప్‌లతో నరకయాతన అనుభవిస్తున్నారు. అన్ని యాప్‌లలో గ్రూపుల వివరాలను నమోదు చేయడం, కొన్ని సందర్భాలలో నెట్ అందుబాటులో లేకపోతే మళ్లీ మొదటి నుంచి చేయాల్సి వస్తుండటంతో రోజంతా ఇదే పని సరిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మన డబ్బులు..మన లెక్కలు అంటూ ఉమెన్ పవర్ పేరుతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ యాప్

యాప్‌లపై శిక్షణ అంతంత మాత్రమే..

ఉమెన్ పవర్, లోకోస్ తదితర యాప్ వినియోగంపై జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు, వీవోఏలు అరకొరగానే అవగాహన కల్పించారు. ప్లే స్టోర్ నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసి వాటిని ఏవిధంగా వినయోగించాలనే అంశంపై ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. దీంతో ఆయా యాప్‌ల నిర్వహణ డ్వాక్రా గ్రూపు నిర్వాహకుల, ఐకేపీ సిబ్బందిపై పనిభారం పెరుగుతోందని వారు వాపోతున్నారు.

జిల్లావ్యాప్తంగా 29,283 గ్రూపులు..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 29,293 డ్వాక్రా గ్రూపులున్నాయి. ఒక్కొ గ్రూపులో పదిమంది సభ్యులు చొప్పున సుమారు 2,92,830 మంది సభ్యులున్నారు. వీరి వివరాలను నమోదు చేయడానికి క్షేత్రస్థాయిలోని వీవోఏలు తలకు మించిన భారమవుతోంది. ఈ యాప్‌లతోనే కాకుండా అదనపు పనిభారంతో సతమతమవుతున్నారు.

యాప్‌లలో నమోదుతో ఇబ్బంది



డ్వాక్రా మహిళల వివరాలన్నింటిని యాప్‌లలో నమోదు చేస్తున్నారు. కుటుంబసభ్యుల వివరాలతోపాటు గ్రూపు లావాదేవిలన్నింటినీ యాప్‌లో నమోదు చేయడం సబబుకాదు. ఈ యాప్‌లోని అంశాలు బహిర్గతమైతే ఎవరు బాధ్యత వహిస్తారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేయకుండా వివరాలన్నింటిని నమోదు చేయడం సరైన విధానం కాదు. ఈఅంశంపై భరోసా కల్పించాల్సిన బాధ్యత వెలుగు సిబ్బందిపై ఉంది.

– రాజులపాటి వాణి, ఎంపీపీ, పెడన

అవగాహన కల్పించాం..

ఆయా యాప్‌ల వినియోగంపై వెలుగు సిబ్బందితోపాటు క్షేత్రస్థాయిలో మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాం.ఎవరికైనా అపోహలుంటే తక్షణం నివృత్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు కూడా జారీ చేశాం. సాంకేతిక సమస్యలను సైతం అధిగమిస్తున్నాం. మహిళా సంఘాల పనితీరు మెరుగుపరచడంతోపాటు ప్రతిఒక్కరికి న్యాయం చేసేందుకు ఈ యాప్‌లు ఉపయోగపడతాయి.

– హరిహరనాథ్, పీడీ, డీఆర్‌డీఏ, మచిలీపట్నం

డ్వాక్రా మహిళల ఆందోళన..

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమెన్ పవర్ యాప్‌లో ఓ డ్వాక్రా గ్రూపు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన లావాదేవీలు.. వారు పొదుపు చేసిన నగదు, తీసుకున్న రుణం..చెల్లించిన మొత్తం..పెండింగ్ బకాయిలు..పావలా వడ్డీ రుణాలు..ప్రభుత్వ రుణమాఫీ..పసుపుకుంకుమ కింద పొందిన లబ్ధి తదితర వివరాలన్నింటినీ పొందుపరుస్తున్నారు. డిఫాల్ట్ సభ్యుల వివరాలను కూడా సేకరిస్తున్నారు. ఈ మొత్తం సమాచారాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శులకు అనుసంధానం చేశారు. దీంతో మహిళా సంఘాల మొత్తం డేటా ఢిల్లీలో దర్శనమిస్తోంది. పీఎంజీపీ, పీఎంఎస్ఎంఈ వంటి రుణాలు బినామీలకు వెళ్లకుండా చెక్ పెట్టడానికే అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ ఇలా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సబబుకాదని మహిళలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

నిరక్షరాస్యత నిర్మూలన అంశం కూడా క్షేత్రస్థాయిలో వీరికే అప్పగించారు. స్వచ్ఛగ్రామీణ సంరక్షన్ కూడా అప్పగించడంతో పనిభారం అధికమై తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారు. పనిచేయలేమని చెబుతుంటే మీరు మానేస్తే మరొకరు వస్తారంటూ బెదిరింపులకు దిగుతుండటంతో చేసేది లేక పనిభారంతోనే ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరులోగా వివరాల నమోదు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేయడంతో వీవోఏలు మరింత ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం):జిల్లాలో యూరియాను దారి మళ్లిస్తూ కొరత సృష్టించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకె బాలాజీ హెచ్చరించారు. జిల్లాలో యూరియా దారిమళ్లింపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది కంటే ఈ సీజన్‌లో దాదాపు 17వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అయితే కొంతమంది యూరియాను దారి మళ్లిస్తూ కొరత సృష్టిస్తున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి జాతీయ భద్రత చట్టం కింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యూరియా కేవలం రైతులకు మాత్రమేనని, ఆక్వా పరిశ్రమలు తదితర వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇందుకోసం డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండలస్థాయిలో తహసీల్దార్, జిల్లాస్థాయిలో వ్యవసాయశాఖ అధికారితో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఆయా కమిటీలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. చేపల చెరువులు, పరిశ్రమలు సందర్శించి తనిఖీలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అధికంగా యూరియా కొనుగోలు చేసినవారు వ్యవసాయానికి మాత్రమే వినియోగిస్తున్నారా? లేదా డీలర్లు యూరియాను అక్రమంగా ఇతరులకు విక్రయిస్తున్నారా? అని నిగ్గుతేల్చేందుకు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా యూరియాను వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే బాధ్యులపై తక్షణమే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, బీఎస్ హేళాషారోన్, జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు, మార్క్‌ఫెడ్ డీఎం మురళీకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్ అందరి బాధ్యత

మచిలీపట్నంఅర్బన్: ఎయిడ్స్‌పై అవగాహన పెంచి యువత భవిష్యత్‌ను కాపాడే బాధ్యత మనందరిపై ఉందని జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ సాల్మన్‌రాజు పేర్కొన్నారు. ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 5కె మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత జీవన శైలిని అనుసరించడం ద్వారా ఎయిడ్స్‌ను పూర్తిగా నివారించవచ్చన్నారు. స్థానిక చిలకలపూడి సెంటర్ నుంచి నోబుల్ కళాశాల వరకు జరిగిన ఈ మారథాన్‌లో 75మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో బి.పవన్ కళ్యాణ్ (నోబుల్ కళాశాల), కారే కార్తికేయ (రుద్రపాక జూనియర్ కళాశాల), బి.లోకేష్ (మొవ్వ జూనియర్ కళాశాల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో షేక్ అయేషా (నోబుల్ కళాశాల), టి. చైతన్యలక్ష్మి (మొవ్వ జూనియర్ కళాశాల), చింతగుంట కళ్యాణి (రుద్రపాక జూనియర్ కళాశాల)వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నగదు బహుమతులుగా వరుసగా రూ.10వేలు, రూ.7వేలు, 5వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు, జిల్లా నోడల్ ఆఫీసర్ మధుసూదనరావు, సీఎస్‌వో సాక్షి గోపాల్, నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జె. ఎర్నెస్ట్, లెక్చరర్లు పి.వి.నరసింహారావు, రంగనాయకులు, ఎన్జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు.



మారథాన్ విజేతలతో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ సాల్మన్‌రాజు, అధికారులు

ఎట్టకేలకు డీఎస్సీ ఫలితాలు

- ఉమ్మడి జిల్లాలో 1208 పోస్టులు
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు బందరు నోబుల్ కాలేజ్‌లో ఏర్పాట్లు
- గందరగోళంలో అభ్యర్థులు
- ఫలితాల ప్రకటన తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎట్టకేలకు డీఎస్సీ ఫలితాలను ప్రభుత్వ విడుదల చేసింది. అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించి రాష్ట్ర, జోన్, జిల్లా స్థాయి మెరిట్ జాబితాలను ప్రకటించింది. వివిధ కేటగిరి పోస్టులకుగాను జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ఐడీల ద్వారా కాల్ లెటర్లు అందజేస్తారని అధికారులు ప్రకటించారు.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివిధ కేటగిరీలు, సబ్జెక్ట్‌లకు సంబంధించి 1208 పోస్టులకు ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. దానికి గాను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19,953 మంది అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నారు. వారివారి అర్హతలను బట్టి కొంతమంది రెండు, మూడు పోస్టులకు సైతం దరఖాస్తు చేసుకున్నారు. ఆ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి 35,220 దరఖాస్తులు వచ్చాయి.

నోబుల్ కళాశాలలో వెరిఫికేషన్‌కు ఏర్పాట్లు

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను మచిలీపట్నం నోబుల్ కళాశాలలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుందని అధికారులు తెలిపారు. ఆది, సోమవారాల్లో ఈ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు ఏమేం తీసుకురావాలనే సమాచారాన్ని వారి కాల్ లెటర్లలో ఉన్న సమాచారానికి అనుగుణంగా ఆయా సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని అధికారులు చెబుతున్నారు.

ప్రకటనపై గందరగోళం

డీఎస్సీ ఫలితాల ప్రకటనపై అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు. ప్రధానంగా మెరిట్ లిస్ట్ చూసుకోవటం, పరిశీలించటం తదితర అంశాలపై చాలామంది గందరగోళానికి లోనవుతున్నారు. గతంలో ఫలితాలు ప్రకటించే విధానానికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి. దీనివలన పారదర్శకత లోపిస్తోందని, పలు అనుమానాలకు కూడా తావిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

ప్రమాదపుటంచుల్లో దీవి

- చోద్యం చూస్తున్న పాలకులు..
- పట్టించుకోకపోతే మనుగడకే పెనుముప్పు

కృత్తివెన్ను: సాగర జలాలను ముద్దాడుతూ ప్రకృతి అందాలను ఒలకబోస్తూ ఆహ్లాదంగా పలకరించే సుందరద్వీపం చినగొల్లపాలెం మనుగడ రోజు రోజుకు ప్రశ్నార్థమవుతోంది. మూడు వైపులా ఉప్పుటేరు, మరోవైపు బంగాళాఖాతం వెరసి నలువైపులా నుంచి నీరు ఈ దీవిని కబళిస్తుండటమే ఇందుకు కారణం. ఇప్పటికే కడలి వందలాది ఎకరాలను తనలో కలిపేసుకోగా, పాలకులు స్పందించి ఆదుకుంటారంటూ చినగొల్లపాలెం దీవి వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రోజులు గడిచేకొద్దీ తమ ఉనికికే ప్రమాదమనే తెలిసినా పుట్టిన గడ్డను వదల్లేక కన్నీటి పర్యంతమవుతున్నారు.

ప్రకృతి ఒడిలో సుందర పుష్పం...

కృత్తివెన్ను మండలం కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దున బంగాళాఖాతం, ఉప్పుటేరులు సరిహద్దుగా ఉన్న గ్రామం చినగొల్లపాలెం. చుట్టూ నీటితో ఉండటంతో ద్వీపంగా పిలుస్తారు. పది కిలోమీటర్లు పొడవున ఉండే ఈ దీవి దాదాపు పదివేల ఎకరాల్లో విస్తరించి ఉంది. నాలుగువేల ఎకరాలు పైచిలుకు సాగు విస్తీర్ణం కలిగిన ఈ దీవిలో ప్రధానంగా సరుగుడు, కొబ్బరి, పాక్షికంగా మామిడి, సపోట సాగు చేస్తారు. సాగునీటి సౌకర్యం లేకపోవడంతో కేవలం వర్షాధారంగా తక్కువ విస్తీర్ణంలో వరి, వేరుశనగ పండిస్తారు. పదివేల జనాభా కలిగిన దీవి ప్రస్తుతం ప్రమాదం అంచులో ఉంది. బంగాళాఖాతం దీవి వైపు వేగంగా దూసుకువస్తుండటమే ఇందుకు కారణం.

సముద్రపుకోతతో పెనుముప్పు...

గతంలో దీవికి తూర్పు వైపున పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దుగా పాతకాలువ పేరుతో ఉప్పుటేరు పాయ ఉండేది. దీని ద్వారా ఎగువన భీమవరం కాలువ (యనమదుర్రు డ్రైన్) మొగల్తూరు కాలువ, కొల్లేరు ముంపునీరు సముద్రంలో కలిసేది. వరద నీటి తాకిడి ఎక్కువగా ఉండటంతో దీవికి ముప్పుగా భావించి 1970వ ప్రాంతంలో దీవికి పశ్చిమాన పడతడిక పంచాయితీ సరిహద్దుగా మరో కాలువను తవ్వారు. దీన్ని ఈప్రాంత వాసులు కొత్తకాలువగా పిలుస్తారు. కొల్లేరు నుంచి వచ్చే ముంపు నీరు ఈకాలువ ద్వారానే బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ కాలువ తవ్వకంతో అప్పటి వరకు ద్వీపకల్పంగా ఉన్న ఈప్రాంతం మానవ కల్పిత ద్వీపంగా మారిపోయింది. పాతకాలువ, కొత్తకాలువల ముఖద్వారాలు పూడుకుపోవడంతో సముద్రం నీరు మైదాన ప్రాంతంలోకి చొచ్చుకువస్తోంది. దీంతో ఇప్పటికే సుమారు ఎనిమిది వందల ఎకరాలకుపైగా పంట భూములు సముద్రంలో కలిపోయాయి.

పట్టించుకునే నాథుడేడీ?.

సముద్ర నీరు చొచ్చుకురావడాన్ని నివారించకపోతే అత్యంత త్వరలో దీవి సముద్రంలో కలిసిపోయే ప్రమాదం ఉందని చిన్నగొల్లపాలెం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీవి సంరక్షణ కోసం చర్యలు చేపడుతున్నామంటున్న పాలకుల హామీలన్నీ కాగితాలకే పరిమితం కావడం గ్రామస్తులను మరింత భయాందోళనలకు గురిచేస్తోంది. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకుని కాలువ ముఖద్వారాల్లో పూడికతీత పనులు చేపట్టడంతోపాటు సముద్రం వెంబడి రాతి కట్టడాన్ని నిర్మించి దీవిని కాపాడాలని దీవి వాసులు కోరుతున్నారు.



చినగొల్లపాలెం దీవి



దీవి వైపు కదలివస్తున్న సముద్రం

ఆర్జిత సేవలకు డిమాండ్



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ అమావాస్య నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాలలో ఉభయదాతలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. ఇక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చనలు శనివారంతో ముగిశాయి. శనివారం కూడా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక కుంకుమార్చనలు జరిపించుకున్నారు. సాయంత్రం పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

నూతన అన్నదాన భవన పరిశీలన

రాజగోపురం ఎదుట నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనాన్ని ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. దసరా ఉత్సవాల నాటికి అన్నదాన భవనం అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్లోక్‌రూమ్, సెల్‌ఫోన్ కౌంటర్‌ను తనిఖీ చేసిన ఈవో సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కనకదుర్గనగర్‌లో నిర్మిస్తున్న సమాచార కేంద్రాన్ని పరిశీలించారు. ఈవో వెంట ఈఈ రాంబాబు, ఏఈ మస్తాన్, సునీల్, ఇతర అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

యూజీఎస్ టైమ్ అపర్చునిటీ పరీక్షల ఫలితాలు విడుదల



కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలకు సంబంధించి యూజీఎస్ టైమ్ అపర్చునిటీ ఫలితాలను శనివారం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ విడుదల చేశారు. 1,658 మంది విద్యార్థులు 2,408 పేపర్‌లు రాశారు. 1,329 పేపర్లలో ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.వీరబ్రహ్మచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్. ఉష తదితరులు పాల్గొన్నారు.

3 వేల మందితో గణపతి మట్టి విగ్రహాల తయారీ



పెనమలూరు: మూడు వేల మంది విద్యార్థులు వినాయకుడి మట్టి విగ్రహాలు తయారు చేశారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీలో శనివారం ఎకో క్లబ్, పీవీపీ సిద్ధార్థ, లిటిల్ హ్యాండ్స్ ఆర్గనేజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సిద్ధార్థ కాలేజీ మైదానంతో మూడు వేల మంది విద్యార్థులు మట్టి వినాయకుడి విగ్రహాలను రూపొందించారు. అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్(ఐబీఆర్)లో నమోదు ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించాని ఫస్ట్ ఇయర్ ఇన్‌చార్జ్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ చాగర్లమూడి కవిత తెలిపారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎ.వి.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, డీన్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను జాగ్రత్తగా పరిశీలించాలి

కృష్ణా డీఈఓ రామారావు



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనపై ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

మచిలీపట్నంఅర్బన్: తమ సర్టిఫికెట్లు అన్నీ సక్రమంగా ఉంటే డీఎస్సీ అభ్యర్థుల సొంత లాగిన్‌లోనే అప్‌డేట్ చేయాలని, తమ లాగిన్‌లో మార్పులు చేయకూడదని కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు సూచించారు. స్థానిక నోబుల్ కళాశాలలో శనివారం డీఎస్సీ–2025 ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలనపై విద్యాశాఖ అధికారులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ రామారావు మాట్లాడుతూ.. అభ్యర్థి రెండు లేదా అంతకంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేస్తే అన్ని పోస్టులకూ ఒకేసారి సర్టిఫికెట్ల పరిశీలన చేయాలన్నారు. ఈ ప్రక్రియలో గోప్యతను కచ్చితంగా పాటించాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్ప మరే కాపీలను అంగీకరించరాదని, కలర్ జిరాక్స్ లేదా ఫొటో స్టాట్ కాపీలను తిరస్కరించాలని స్పష్టంచేవారు. నకిలీ సర్టిఫికెట్లు, నకిలీ కుల ధ్రువీకరణ, నకిలీ యూనివర్సిటీ డిగ్రీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అప్లికేషన్ సమయంలో సమర్పించిన కుల ధ్రువీకరణ పత్రం మాత్రమే చెల్లుబాటవుతుందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 23 బృందాలను నియమించామని, ప్రతి బృందం రోజుకు 50 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయాలని సూచించారు. వివరాల నమోదులో తప్పులు జరిగితే సంబంధిత కమిటీ సభ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల ధ్రువీకరణ సంబంధిత అంశాలపై రెవెన్యూ అధికారులను ప్రత్యేకంగా భాగస్వామ్యం చేశామన్నారు. హిందీకి సంబంధించిన పాత, కొత్త అర్హతల మధ్య తేడాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. అప్లికేషన్ సమయానికి ఉన్న కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ మాత్రమే చెల్లుబాటు అవుతుందన్నారు. ఎలిజిబుల్, నాన్ ఎలిజిబుల్ అభ్యర్థులను స్పష్టంగా నోట్ చేయాలన్నారు. అభ్యర్థి వద్ద 2025 మే 15వ తేదీ లోపు సర్టిఫికెట్లు పొంది ఉండాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన విధులకు ఉద్యోగులు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువ మేధకు చుక్కాని.. ఆర్‌టీఐహెచ్

ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ



నియామక పత్రాలు అందజేస్తున్న జేసీ ఇలక్కియ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువ మేధస్సుకు పదునుపెట్టి, ప్రోత్సహించి పరిశ్రమల స్థాపన దిశగా చేయిపట్టి నడిపించడంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కీలకపాత్ర పోషిస్తుందని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అన్నారు. యువ మేధకు ఆర్‌టీఐహెచ్ చుక్కాని వంటిదని పేర్కొన్నారు. విజయవాడ స్పోక్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో టీమ్ – ఆర్‌టీఐహెచ్ కొత్త ఉత్సాహంతో కృషి చేయాలని జేసీ సూచించారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్ కార్యాలయానికి సంబంధించి సీఈఓగా జి.కృష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్‌గా డి.రవితేజకు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శనివారం నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా విజయవాడతో పాటు రాష్ట్రంలో మొత్తం ఐదు ప్రాంతాల్లో స్పోక్స్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఐహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం వీఆర్వో ఆత్మహత్యాయత్నం

జగ్గయ్యపేట: మండలంలోని అన్నవరం వీఆర్వోగా పని చేస్తున్న బి.వరలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వరలక్ష్మి అన్నవరం గ్రామంలో కొంత కాలంగా వీఆర్వోగా పని చేస్తున్నారు. శనివారం ఉదయం ఆటోలో గ్రామానికి విధులకు వస్తూ పాలేటి సమీపంలోని కోళ్ల ఫారం వద్దనున్న పొలాలకు వెళ్లారు. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవటంతో తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. కొంత సేపటికి ఆమెను గమనించిన రైతులు, స్థానికులు హుటాహుటిన జగ్గయ్యపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు. విధులకు సంబంధించి ఉన్నతాధికారులు వత్తిడి చేయటంతో పాటు అదనపు పనులను అప్పగిస్తున్నారన్న మనస్తాపంతోనే వరలక్ష్మి ఆత్మహత్యకు యత్నించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

రేపు నున్నలో సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

నున్న(విజయవాడరూరల్): ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళలు, సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 25వ తేదీన నున్న గ్రామంలోని విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో జరుగుతుందని నిర్వహణ కార్యదర్శులు గమిడి సాంబశివరావు, గరికపాటి మారుతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన మహిళల జట్టు ఈ నెల 30, 31 తేదీల్లో పల్నాడు జిల్లాలో జరిగే అంతర్ రాష్ట్ర పోటీల్లో, బాల బాలికల జట్లు వచ్చే నెల 20, 21, 22 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే అంతర్ రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని పేర్కొన్నారు. సబ్ జూనియర్ జట్టుకు 2011 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టినవారు మాత్రమే అర్హులని స్పష్టంచేవారు.

బీమా మొత్తాన్ని వడ్డీతో చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారుడికి వడ్డీతో బీమా మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు నందిపాటి పద్మారెడ్డి, సభ్యురాలు శ్రీలక్ష్మీరాయల శనివారం తీర్పు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గం అశ్వారావు పాలెం గ్రామానికి చెందిన విశ్వనాథుని యువకిషోర్‌కు అవనిగడ్డ ఎల్‌ఐసీ బ్రాంచ్‌లో 15 ఇన్సూరెన్స్ పాలసీలు ఉన్నాయి. వీటికి ఆయన తండ్రి వెంకటేశ్వరరావు నామినీగా ఉన్నారు. 2023 జూన్ ఏడో తేదీన కిషోర్ మేడపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మరణించాడు. క్లయిమ్ కోసం కిషోర్ తండ్రి వెంకటేశ్వరరావు అవనిగడ్డ ఎల్‌ఐసీని సంప్రదించగా ప్రమాదవశాత్తు మరణం బదులు, సాధారణ మృతిగా బీమా పరిహారం చెల్లించారు. దీంతో వెంకటేశ్వరరావు న్యాయం కోసం వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం కిషోర్ తీసుకున్న 15 ఇన్సూరెన్స్ పాలసీలకు యాక్సిడెంటల్ క్లయిమ్ మొత్తం రూ.5.50 లక్షలు ఫిర్యాదుదారునికి 9 శాతం వడ్డీతో తిరస్కరించిన తేదీ నుంచి చెల్లించాలని, మానసిక వేదనకు రూ.30 వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు కలిపి తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా అందజేయాలని వినియోగదారుల కమిషన్ ఆదేశించింది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

పెనమలూరు: కొద్ది నెలల క్రితం పెనమలూరులో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ వెంకటరమణ కథనం మేరకు.. పెనమలూరు మహిళా మండలి కాలువ కట్టపై ఉంటున్న దేరంగుల పిచ్చయ్యకు ఓ మహిళతో వివాదం తలెత్తింది. ఆ మహిళకు మద్దతుగా వేల్పుల రమణ (అఖిల్), ముగ్గురు బిహార్ యువకులు పిచ్చయ్యతో గొడవపడి దాడి చేసి హత్య చేశారు. ఈ కేసులో నలుగురు నిందితుల్లో అఖిల్‌ను పోలీసులు ఘటన జరిగిన వెంటనే అరెస్టు చేశారు. మిగితా నిందితులు బిహార్‌కు చెందిన వారు కావటంతో వారు దొరకలేదు. నిందితుల్లో ఒకరైన బిహార్ రాష్ట్రానికి చెందిన విపిన్ సహానీని పోలీసులు పెనమలూరులో శనివారం అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచగా నెల్లూరు జైలుకు రిమాండ్ విధించారు. ఈ కేసులో నిందితులను పట్టుకునే విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతుడి బంధువులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఒక ఎస్‌ఐపై బదిలీ వేటు కూడా పడింది. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



నిందితుడితో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

గన్నవరం: వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని శనివారం ఉంగుటూరు పోలీసులు అరెస్ట్ చేసి సుమారు రూ.7 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సీహెచ్. శ్రీనివాసరావు ఈ కేసు వివరాలను శనివారం విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఈ నెల మూడో తేదీ అర్ధరాత్రి ఉంగుటూరు మండలం వెన్నూతుల గ్రామానికి చెందిన వృద్ధురాలు బొమ్మి సింహాచలంను ఓ దుండగుడు కత్తితో బెదిరించి ఆమె మెడలోని మూడు కాసుల బంగారు గొలుసు చోరీచేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఉంగుటూరు పోలీసులు సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడింది విజయవాడకు చెందిన పాతనేరస్తుడు బుగత శివగా గుర్తించారు. ఈ నెల 22వ తేదీన గారపాడు వద్ద అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా నేరానికి పాల్పడినట్లుగా అంగీకరించాడు. ఇతనిపై గతంలో చేబ్రోలు, తాడేపల్లి గూడెం, గండేపల్లి, ఏలూరు రూరల్, విజయవాడ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్లలో 20కి పైగా చోరీ కేసులు నమోదయ్యాయని పోలీసులు గుర్తించారు. తాడేపల్లిగూడెం పీఎస్‌లో అతనిపై ఓ హత్య కేసు కూడా ఉంది. ఈ ఏడాది జూన్ ఆరో తేదీన ఏలూరు జిల్లా జైలు నుంచి విడుదలైన శివ తన పద్ధతి మార్చుకోకుండా తిరిగి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అతడి నుంచి మూడు కాసుల బంగారు గొలుసుతో పాటు బాదంపూడి పీఎస్ పరిధిలో చోరీ చేసిన బంగారు ఆభరణాలు, ఏలూరు మూడో టౌన్ పీఎస్, వీరవల్లి పీఎస్ పరిధిలో అపహరించిన మూడు మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శివను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును సీఐ బి.వి.శివప్రసాద్ నేతృత్వంలోని త్వరితగతిన ఛేదించిన ఎస్‌ఐ యు.గోవిందు, సిబ్బంది మట్టా నవీన్‌బాబు, నిమ్మకూరి దిలీప్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు.

స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

కోనేరుసెంటర్(మచిలీపట్నం): స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. బందరు మండలంలోని పోతేపల్లి గ్రామంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో పరిశుభ్రత అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ డి.కె.బాలాజీ పాల్గొన్నారు. గ్రామంలోని మురుగు కాలవల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి, కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి జ్వరాల బారిన పడకుండా ప్రజలందరూ జాగ్రత్త వహించాలన్నారు. ప్రభుత్వం వెక్టార్ హై జీన్ యాప్‌ను ప్రవేశ పెట్టిందని, ఆరోగ్యశాఖ సిబ్బంది ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే గుర్తించి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయగానే మునిసిపల్, పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి ఆ సమస్యను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. అనంతరం మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి మొక్కలు నాటారు. డీపీఓ జె. అరుణ, జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు, మచిలీపట్నం ఏఎంసీ చైర్మన్ కుంచె నాని, తహసిల్దారు నాగ భూషణం, ఎంపీడీఓ వెంకటేశు, డీఎల్‌పీఓ రహమతుల్లా, ఎంఈఓ దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఆస్తుల కేసులో శైలేంద్రకుమార్ అరెస్టు



సోదాల్లో పట్టుబడిన నగదు బంగారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై పరిశ్రమలశాఖ డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ చల్లరపు శైలేంద్రకుమార్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. శైలేంద్ర కుమార్ విజయవాడలోని పరిశ్రమలశాఖ డైరెక్టర్ కార్యాలయంలో డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా పని చేస్తున్నారు. ఆయన అక్రమ ఆస్తులు కూడబెట్టారనే సమాచారంతో ఒంగోలు ఏసీబీ అధికారులు అతని ఇళ్లలో సోదాలు జరిపారు. శైలేంద్ర కుమార్ బంధువుల ఇళ్లలో ఏడు చోట్ల రెండు రోజులపాటు తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో పెద్ద మొత్తంలో ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు, బంగారపు బిస్కెట్లు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, పెద్దమొత్తంలో నగదు, వాహనాలను గుర్తించారు. ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోదాల అనంతరం శైలేంద్రకుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం శైలేంద్రకుమార్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నారు.

అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

పెడన: బంధువు అంత్యక్రియలకు వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెడనలో జరిగింది. స్థానిక మునిసిపల్ వాటర్ హౌస్‌కు వెళ్లే మార్గంలోని పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం బొక్కాబోర్లాపడి ఉండటంతో శనివారం ఉదయం ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది. స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి ఆ మృతదేహాన్ని బయటకు తీయడంతో మృతుడిని బంధువులు గుర్తించారు. పట్టణంలోని దక్షిణ తెలుగుపాలేనికి చెందిన కోమట్ల శివనాగరాజు (43) శుక్రవారం ఉదయం తమ బంధువు ఒకరు చనిపోవడంతో శ్మశానంలో అంత్యక్రియలకు హాజర్యాడు. అంత్యక్రియలు పూర్తయ్యాక అందరితో పాటు శివరామరాజు పంట కాలువలో స్నానాకి దిగాడు. అందరూ వెళ్లిపోతూ శివనాగరాజును కూడా రమ్మన్నారు. దీంతో తాను ఈత కొట్టుకుంటూ అందరికంటే ముందుగా వచ్చే స్తానని కాలువలోనే ముందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతను ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని బంధువులు అనుకున్నారు. శనివారం ఉదయం కాలువలో శవమై తేలాడు. కాలువలో మృతదేహం ఒక కర్రకు చిక్కుకుని ఉండిపోయింది. పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ జి.సత్యనారాయణ, ట్రైనీ ఎస్‌ఐ నాగరాజు ఆ మృతదేహాన్ని బయటకు తీయించారు. వీఆర్వో మోర్ల శ్రీనివాసరావు శవపంచానామ నిర్వహించిన పిమ్మట మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివనాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు. భార్య జ్యోతితో పదేళ్ల కిందట గొడవపడటంతో కలిదిండి మండలం గోపాలపురంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శివనాగరాజు తల్లి సంపూర్ణమ్మ వద్ద ఉంటున్నాడు. ఇటీవల తల్లిని కూడా తిట్టి, కొట్టడంతో ఆమె కూడా ఎక్కడికో వెళ్లిపోయింది. ఒంటరిగా ఉంటున్న శివనాగరాజు మృతి చెందడంతో అన్నకుమారుడు కోమట్ల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్తాచాటిన నాగాయలంక క్రీడాకారులు



పతకాలు సాధించిన గాయత్రి, రాజేష్

నాగాయలంక: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీనగర్(జమ్ము అండ్ కాశ్మీర్)లో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరిగిన ప్రథమ ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో నాగాయలంక వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులు సత్తాచాటారు. కే–1 ఉమెన్స్ విభాగంలో నాగిడి గాయత్రి రజత పతకం, సీ–1లో కెనోయింగ్ స్లాలమ్‌లో నాగిడి రాజేష్ కాంస్య పతకం సాధించారు. కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో అక్కడి ప్రజలు, పర్యాటకులలో నూతనోత్సాహం కలిగించే క్రమంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఆధ్వర్యంలో వాటర్ స్పోర్ట్స్‌లో కెనోయింగ్, కయాకింగ్, స్లాలమ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. 28 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 500 మంది వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎనిమిది మంది ప్రాతినిధ్యం వహించారని అసోసియేషన్ అడ్వయిజర్ తిప్పిరెడ్డి శివారెడ్డి తెలిపారు. నాగాయలంకకు చెందిన అక్క,తమ్ముడు గాయత్రి, రాజేష్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, గ్రామ ప్రముఖులు, పలువురు అగ్నికుల క్షత్రియ సంఘాల నేతలు అభినందించారు.